## వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 10: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ(టెక్నాలజీ మేనేజ్మెంట్) మొదటి సెమిస్టర్, ఎంపీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలతోపాటు దూరవిద్య ద్వారా అందించే ఎంసీఏ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్సైట్ www. osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

### ఓయూ అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీల ఫలితాలు..

ఓయూ అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీల ఫలితాలను అధికారులు విడుదల చేశారు. ఈ పోటీలను ఈనెల 4, 5 తేదీల్లో ఠాగూర్ ఆడిటోరియం, టెక్నాలజీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను ఈనెల 26వ తేదీన నిర్వహించనున్న ఓయూ వ్యవస్థాపక దినోత్సవం ప్రదానం చేయనున్నట్లు వివరించారు.

### డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు.బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీబీఏ, బీఎస్.డబ్ల్యూ తదితర కోర్సుల రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈనెల 30వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో వచ్చే నెల 7వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను జూన్ నెలలో నిర్వహించనున్నట్లు, పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు.

## నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఉపాధి కల్పన

బేగంపేట్, ఏప్రిల్ 10: కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్, టెక్ మహేంద్ర ఫౌండేషన్ స్మార్ట్ సెంటర్ సంయుక్తాధ్వర్యంలో నిరుద్యోగ యువతకు తగిన ఉచిత శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ, ఇంటర్, డిగ్రీ చదివిన యువతకు హెల్త్‌కేర్ రంగం, బిల్లింగ్ ఎగ్జిక్యూటివ్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ తదితర ఉద్యోగాలను తగిన శిక్షణ అందించి ఉపాధి కల్పిస్తామని బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకు సుమారు వెయ్యి మందికి ఉపాధి కల్పించినట్లు ఆయన తెలిపారు. అలాగే దరఖాస్తు చేసుకున్న యువతకు ప్రధానంగా స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ ట్రైనింగ్ తదితర వాటిపై ఉచితంగా శిక్షణ అందిస్తామని, అనంతరం ఉద్యోగం కూడా కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. యువతీయువకులు తగిన అర్హత కలిగిన సర్టిఫికెట్లతో సికింద్రాబాద్ ప్యారడైజ్ పాత స్వప్న్ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న కార్యాలయంలో సంప్రదించాలని, మరిన్ని వివరాలకు ఫోన్: 82472 55859, 80198 18841 నంబర్లలో సంప్రదించాలని చెప్పారు.

## హనుమాన్ జయంతికి పలువురికి ఆహ్వానం

సికింద్రాబాద్, ఏప్రిల్ 10:హనుమాన్ జయంతి పూజలకు హాజరుకావాలని ఆహ్వాన కమిటీ సభ్యులు పలువురు నాయకులకు ఆహ్వానం అందించారు.విశ్వశాంతి యువజన సంఘం, శ్రీదేవుకు ఎల్లమ్మ దేవాలయ బీడీ బస్తీలో ఈనెల 12న నిర్వహించనున్న హనుమాన్ జయంతి ప్రత్యేక పూజ, హనుమాన్ ధ్వజ ఊరేగింపు కార్యక్రమానికి హాజరుకావాలని, నోముల ప్రకాశ్, చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్‌లను ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నంధారం సీతారామ్, ప్రధాన కార్యదర్శి శేషగిరి రావు, జి ఎం మల్లేశ్, రాజమౌళి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## యువకుడి అదృశ్యం



కమల్(ఫైల్)

ముషీరాబాద్, ఏప్రిల్ 10: మతిస్థిమితం లేని ఓ యువకుడు తప్పిపోయిన సంఘటన ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు కథనం ప్రకారం..మతిస్థిమితం సరిగ్గాలేని యువకుడు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో అతడి తల్లిదండ్రులు ముషీరాబాద్ పోలీసులను ఫిర్యాదు చేశారు. రాంనగర్ మేజిబాని బస్తీకి చెందిన సంతోష్ అలియాస్ కమల్(34)కు మతిస్థిమితం సరిగ్గాలేదు. గత వారం రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతని తల్లిదండ్రులు తమ బంధువులు, స్నేహితుల ఇండ్లలో వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో గురువారం ముషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

**బేగంపేట ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు**

బొల్లారం, ఏప్రిల్ 10: మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తప్పవని బేగంపేట ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు అన్నారు.గురువారం తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులకు ట్రాఫిక్ సీఐ మధుబాబుతో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ట్రాఫిక్ కమిషనర్ జోయల్ డేవీస్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ట్రాఫిక్ రాహుల్ హెగ్డే, వేణుగోపాల్ రెడ్డి అడిషనల్ డీసీపీ ట్రాఫిక్ సూచనల మేరకు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పట్టుబడిన మైనర్లపై మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేసి, వారి తల్లిదండ్రులకు పోలీస్‌స్టేషన్ కౌన్సెలింగ్‌తోపాటు కొన్ని సూచనలు ఇచ్చామని తెలిపారు. అనంతరం మైనర్ల తల్లిదండ్రులతో ప్రమాణం చేయించారు. ట్రాఫిక్ ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్
- బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సమావేశం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, ఏప్రిల్ 10: వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించ తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పిలుపునిచ్చారు. అధిక సంఖ్యలో ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు. గురువారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకుల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వరంగల్‌లో జరిగే రజతోత్సవ బహిరంగ సభకు పెద్దఎత్తున కార్యకర్తలు తరలిరావాలని, వారితోపాటు బీఆర్ఎస్ అభిమానులను తరలించాలని సూచించారు. డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించుకొని తగిన కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. వేలాది మందిగా నియోజకవర్గం నుంచి వరంగల్ సభకు తరలివచ్చేలా కార్యాచరణ రూపొందించాలని కోరారు. నియోజకవర్గాన్ని గులాబీ, జెండాలు ఫ్లెక్సీలతో ముస్తాబు చేయాలని, ప్రతిబస్తీలో గులాబీ జెండా ఎగరవేసి ర్యాలీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు ముఠా జయసింహ, డివిజన్ అధ్యక్షులు రాకేశ్‌కుమార్, కొండా శ్రీధర్‌రెడ్డి, వై.శ్రీనివాస్, వల్లాల శ్యామ్‌యాదవ్, బల్ల శ్రీనివాస్ రెడ్డి, శంకర్ ముదిరాజ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, సురేందర్, పోతుల శ్రీకాంత్, ఆకుల అరుణ్, సాయికుమార్, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

# వరంగల్ సభకు వేలాదిగా తరలిరావాలి

- బీఆర్ఎస్ ద్వారానే తెలంగాణ అభివృద్ధి
- మీడియాతో కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేశ్



కంటోన్మెంట్, ఏప్రిల్ 10 : వరంగల్‌లో ఈ నెల 27వ తేదీన పెద్దఎత్తున జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గజ్జెల నాగేశ్ కోరారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో జరిగే రజతోత్సవాన్ని జయప్రదం చేసి తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలన్నారు. 2000 సంవత్సరంలో పిడికెడు మందితో స్థాపితమైన బీఆర్ఎస్(అప్పుడు టీఆర్ఎస్) 2025 నాటికి పాతికేళ్లు పూర్తి చేసుకొని రజతోత్సవాలు జరుపుకుంటుందన్నారు. 2000లో తెలంగాణ ఉద్యమాన్ని మొదలుపెట్టిన ఉద్యమ సారథి కేసీఆర్.. ఎన్నో కుట్రలు, కుతంత్రాలు దాటుకొని చావునోట్లో తలపెట్టి మరీ 2014లో స్వరాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. అలాంటి ధీశాలి సారథ్యంలో నడుస్తున్న పార్టీలో మనమందరమూ సభ్యులుగా ఉండటం గర్వకారణమన్నారు. 2014లో తెలంగాణ పాలనా పగ్గాలు చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలిపిందని గుర్తుచేశారు. సాగునీరు, తాగునీరు, 24 గంటల కరెంటు, రైతుబంధు, రైతుబీమా వంటి అద్భుత పథకాలన్నీ కేసీఆర్ మానసపుత్రికలేనని జ్ఞప్తికి తెచ్చారు. ఆరు గ్యారెంటీలంటూ ఊదరగొట్టి 15 నెలల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు ఆ గ్యారెంటీలన్నింటినీ అటకెక్కించిందని విమర్శించారు. మహిళలకు రూ.2,500, పెంచిన పింఛన్లు, తులం బంగారం, ఆడపిల్లలకు స్కూటీలు వంటి వాటి కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ఇంకా 420 హామీలు ఇచ్చారని, వాటిని నేటికీ నెరవేర్చలేకపోయారని ధ్వజమెత్తారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో వ్యతిరేకత ఉందని స్పష్టం చేశారు. 25వ వసంతంలోకి అడుగు పెడుతున్న నేపథ్యంలో నిర్వహించనున్న రజతోత్సవ వేడుకలకు కంటోన్మెంట్ నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. వార్డుల్లో ప్రజలను చైతన్యం చేసేలా సభలు నిర్వహించాలని నాయకులకు సూచించారు. సభకు తరలివెళ్లే ముందు ప్రతి వార్డులో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించాలని సూచించారు.

## ఘనంగా మహనీయుల జయంతి ఉత్సవాల ప్రారంభం

ఉస్మానియా విశ్వవిద్యాలయం:ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మహనీయుల జయంత్యుత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరగనున్న కార్యక్రమాలను ఠాగూర్ ఆడిటోరియంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిబాపూలే, జగ్జీవన్ రామ్, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జీవితం, వారు నడిచిన మార్గం నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ఈ ముగ్గురూ భారత దేశ చరిత్రనే మార్చేశారని చెప్పారు. అసమానతలు, అస్పృశ్యత, కుల వివక్షతలకు వ్యతిరేకంగా పోరాడి ఘనతీయమైన మార్పులకు బాటలు వేశారని గుర్తు చేశారు. విద్య, మహిళాసాధికారత కోసం చేసిన కృషిని కొనియాడారు. మహనీయుల జయంతి సందర్భంగా వారు అనుసరించిన మార్గాన్ని భవిష్యత్తు తరాలకు అన్వయించేలా నేటి తరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్, ప్రొఫెసర్ ఈ.సుధారాణి, ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.నరేశ్ రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్ నాయక్, యూజీసీ డీన్ ప్రొఫెసర్ లావణ్య, ఎస్సీ ఎస్టీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డైసీ, సీనియర్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి కరపత్రం విడుదల



కరపత్రం ఆవిష్కరిస్తున్న విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్‌అంబేద్కర్ జయంతి సందర్భంగా తెలంగాణ డెమోక్రటిక్ స్టూడెంట్ ఫోరం(టీడీఎస్ఎఫ్)ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో గురువారం ఆవిష్కరించారు. టీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీఎస్ఎఫ్ సలహాదారు, పోటీ పరీక్షల నిపుణులు ముసవీర్ అలీ హాజరయ్యారు. టీడీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 14న నిర్వహించే అంబేద్కర్ జయంతికి విద్యార్థులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీఎస్ఎఫ్ నాయకులు రమేశ్ నాయుడు, కుమ్మరి అనిల్ కుమార్, కరణ్, కోట ప్రభాకర్, శశి కుమార్, ప్రశాంత్, రాజేందర్ నాయక్, అజయ్ సామ్రాట్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కులం, ఆదాయ సర్టిఫికెట్లకు దళారులను ఆశ్రయించొద్దు



సికింద్రాబాద్ తహసీల్దార్ పాండు నాయక్

బేగంపేట్, ఏప్రిల్ 10: తెలంగాణ ప్రభుత్వ ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాని అవసరమైన సర్టిఫికెట్లను పొందడానికి బ్రోకర్లను ఎట్టి పరిస్థితిలో ఆశ్రయించవద్దని సికింద్రాబాద్ తహసిల్దార్ పాండు నాయక్ సూచించారు. గురువారం తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పథకానికి అవసరమైన ఆదాయ, కులం సర్టిఫికెట్లు అవసరమైన లబ్ధిదారులు మీ సేవా కేంద్రంలో దరఖాస్తులు పెట్టుకోవాలని చెప్పారు. అనంతరం మూడు నాలుగు రోజుల్లో తహసిల్దార్ కార్యాలయంలో అట్టి దరఖాస్తులను పరిశీలించి మంజూరు చేస్తారన్నారు. ఈ ప్రక్రియలో కొంత మంది దళారులు లబ్ధిదారులకు మాయమాటలు చెప్పి మేం సర్టిఫికెట్లను త్వరగా మంజూరు చేయిస్తామని చెప్పి అందిన కాడికి దోచుకుంటున్నట్టు తన దృష్టికి వచ్చిందని తహసీల్దార్ తెలిపారు. సర్టిఫికెట్ల జారీ విషయంలో అవతవకలకు కిందిస్థాయి సిబ్బంది కూడా కొంత అక్రమాలకు పాల్పతున్నట్టు కూడా తన దృష్టికి వచ్చిందని, అట్టివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. లబ్ధిదారులు అత్యవసరమున్న వారు నేరుగా వారి సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

## హనుమాన్ జయంతికి ఆహ్వానం

అమీర్పేట్, ఏప్రిల్ 10: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని బల్కంపేట వీర హనుమాన్ వ్యాయామశాలలో జరిగే వేడుకలకు హాజరు కావాలని కోరుతూ వ్యాయామశాల నిర్వాహకులు బి.రాజేశ్వర్ (ఖలీఫా)గురువారం సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఆహ్వానపత్రాన్ని అందజేశారు.

# పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించాలి

**సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.అరుణ్**




నిరసన కార్యక్రమంలో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.అరుణ్, రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తదితరులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 10:పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించాలి సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్. అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆర్టీసీక్రాస్ రోడ్స్‌లో కట్టెల పొయ్యి గ్యాస్ సిలిండర్ పెట్టి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ పైన రూ.50 ధరలు పెంచి దేశ ప్రజల మీద 3700 కోట్ల భారం వేసిందని విమర్శించారు. పెట్రోలియం ఉత్పత్తులపై స్పెషల్ సర్ చార్జ్ వేసి 37 వేల కోట్ల రూపాయలు భారం వేసిందన్నారు. ధరల పెరుగుదల ద్వారా వచ్చిన సొమ్మును కార్పొరేట్లకు అప్పనంగా కట్టబెడుతుందని మండిపడ్డారు. కావున పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని బీజేపీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీపీఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వ విధానాలు పేదలను కొట్టి గద్దలకు వేసినట్టుగా ఉన్నదని విమర్శించారు. కార్మికుల కనీస వేతనాలు మాత్రం పెంచడం లేదని విమర్శించారు. గ్రామీణ ప్రాంతంలో ఉపాధి హామీ పని కూడా దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజలందరూ బీజేపీ కుట్రలను అర్థం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేశ్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యురాలు టి. జ్యోతి మాట్లాడారు. సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు డీజీ నరసింహారావు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, ఎం.దశరత్, కె. నాగలక్ష్మి నగర కమిటీ సభ్యులు ఆర్.వెంకటేశ్, జె. కుమారస్వామి, ఎస్. మారన్న జి. నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి



సమావేశంలో ఫోరం లోగోను ఆవిష్కరిస్తున్న ఫోరమ్ చైర్మన్ చిరంజీవులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 10: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు కోసం, 42 శాతం స్థానిక సంస్థలలో రిజర్వేషన్‌ను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చడానికి కలిసి వచ్చే బీసీ సంఘాలతో ఉద్యమించాలని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై కోర్ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఫోరానికి సంబంధించిన లోగోను సభ్యులతో కలిసి చిరంజీవులు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇన్నాళ్లు మేధోపరమైన కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలకే పరిమితమైన బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ఇక నుంచి ప్రత్యక్ష బీసీ ఉద్యమంలోకి వస్తుందన్నారు. బీసీలోని కులాలన్ని సంఘటితం కావలసిన అవసరం ఉందన్నారు. బీసీలకు జరిగిన అన్యాలను ప్రజలకు తీసుకెళ్తే చైతన్య పరిచి బీసీ రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. బీసీ భావజనాన్ని ప్రజలకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఇక ముందు జిల్లాల వారీగా, మండలాల వారీగా బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం తెలంగాణ వ్యాప్తంగా బలోపేతం చేస్తామని చెప్పారు. అతి త్వరలోనే రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించి లక్ష మంది బీసీ పోరాట యోధులను తయారు చేస్తామని తెలిపారు. భవిష్యత్తులో బీసీ సబ్ ప్లాన్ కొరకు, బీసీ రాజ్యాధికారం కోసం ఇక నిరంతర పోరాటం చేస్తామని ఆయన ప్రకటించారు. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు తీరా తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ ఏతర ఉద్యమాలకు స్వస్తి పలికి ఉద్యమకారులందరూ బీసీ ఉద్యమంలో దిగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం కోర్ కమిటీ సభ్యులు చామకూర రాజు, కె.వి గౌడ్, అవ్వారు వేణు, కిరణ్ కుమార్, వేములకొండ, శ్రీనివాస్ గౌడ్, ప్రొఫెసర్ వీరాస్వామి, ప్రొఫెసర్ బెనర్జీ, రిటైర్డ్ డీఎస్పి కళ్యాణ్, కోలా జనార్దన్ గౌడ్ , అశోక్ గౌడ్, ఆర్టీసీ రిటైర్డ్ ఈడీ కొమురయ్య, నగేశ్ భూషణ్, రూప, దివ్య తదితరులు పాల్గొన్నారు.

## మహంకాళి దేవాలయంలో తలసాని సాయికిరణ్ పూజలు



అమ్మవారి దేవాలయంలో ఆశీర్వాదం తీసుకుంటున్న తలసాని సాయికిరణ్ యాదవ్ కుటుంబసభ్యులు

బేగంపేట్, ఏప్రిల్ 10: సికింద్రాబాద్‌లోని శ్రీఉజ్జయిని మహంకాళి అమ్మవారిని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువనేత తలసాని సాయికిరణ్ యాదవ్ గురువారం దర్శించుకున్నారు. తన కుమారుడు తలసాని తారక్ జన్మదినాన్ని పురస్కరించుకుని తలసాని సాయికిరణ్ యాదవ్ కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. వారి వెంట రాంగోపాల్‌పేట డివిజన్ బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాయకులు జనార్ధన్, చందు, అభిషేక్, రామ్మోహన్, ప్రకాశ్, వెంకటేశ్, బాలనరసింహ, శ్రీనివాస్, విట్టల్, ప్రవీణ్, మహేశ్, సందీప్, అరుణ్, మధు, దుర్గ తదితరులు ఉన్నారు.

## మున్నూరు కాపులకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్


**రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బండి పద్మ**



బోయినపల్లిలో సమావేశమైన మున్నూరు కాపు మహిళా నేతలు

బొల్లారం, ఏప్రిల్ 10: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణన విషయంలో మున్నూరు కాపులకు అన్యాయం చేస్తుందని మున్నూరు కాపు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బండి పద్మ ఆరోపించారు. గురువారం కంటోన్మెంట్ బోయినపల్లి రాజరాజేశ్వరి గార్డెన్‌లో మున్నూరు కాపు మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా అధ్యక్షురాలు బండి పద్మ మాట్లాడుతూ.. రాజ్యాధికారమే లక్ష్యంగా మున్నూరు కాపు మహిళలు నడుం బిగించినట్లు స్పష్టం చేశారు. జలవిహార్‌లో ఈనెల 13న రాష్ట్రస్థాయి మున్నూరు కాపు మహిళా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మున్నూరు కాపు మహిళా సింహగర్జన పేరుతో పరేడ్ మైదానంలో 10 లక్షల మందితో సభను నిర్వహిస్తామన్నారు. రాజకీయాలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన నేపథ్యంలో మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీలు ఇప్పటికైనా వెనుకబాటుతనాన్ని వీడి రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటూ రాజ్యాధికారం చేపట్టే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్నూరు కాపు రాష్ట్ర సెక్రటరీ పోకల నిర్మల, ఉపాధ్యక్షురాలు అరుణ, గీత, సెక్రటరీ సునీత, శేరిలింగంపల్లి ఇన్‌చార్జి శ్రీలత, సోషల్ మీడియా రాష్ట్ర ఇన్‌చార్జి సంధ్యారాణి, బాలనగర్ ఇన్‌చార్జి శివరంజని, జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి కవిత తదితరులు పాల్గొన్నారు.

## వీఎస్‌టీ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కమిటీ



నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న అధ్యక్షుడు సంజీవరెడ్డి

చిక్కడపల్లి, ఏప్రిల్ 10: వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని గురువారం జరిగిన యూనియన్ సర్వసభ సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు, మాజీ ఎంపీ జీ సంజీవ రెడ్డి ప్రకటించారు. యూనియన్ సలహాదారులుగా ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌డీ చంద్రశేఖర్, వీఎస్‌టీ మాజీ కార్మిక కార్మికుడు కే రాజయ్య, ఛీఫ్ ఉపాధ్యక్షులుగా జి నాగేశ్, ఉపాధ్యక్షులుగా అబ్దుల్ సమాద్, ఏం రణధీర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎల్.డి పాల్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా ఏఆర్ శ్రీనివాస్ యాదవ్, అసిస్టెంట్ కార్యదర్శులుగా ఎల్.నవీన్ బాబు, ఆర్.విజయేందర్, ప్రచార కార్యదర్శిగా ఏ వెంకట్ రెడ్డి, సహాయ ప్రచార కార్యదర్శిగా పి రామ్మోహన్, కార్యనిర్వాహక కార్యదర్శిగా కే ప్రభాకర్, సహాయ కార్యనిర్వాక కార్యదర్శిగా ఎం సాయి ప్రసాద్ రెడ్డి, కోశాధికారిగా డి.కృష్ణారెడ్డి, క్యాంటీన్ సెక్రటరీగా వి.వినోద్‌కుమార్‌లను నియమించారు.

## పల్లె నుంచి ఎదిగొచ్చిన పరిశోధకుడు బిరుదురాజు



సదస్సుకు హాజరైన అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఆచార్య బిరుదురాజు రామరాజు అచ్చమైన పల్లె నుంచి ఎదిగొచ్చిన ఆచార్యుడు, పరిశోధకుడని తెలంగాణ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం అన్నారు. ఆచార్య బిరుదురాజు రామరాజు శత జయంతి సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగంలో ‘ఆచార్య బిరుదురాజు రామరాజు సాహితీ సమాలోచనం’ జాతీయ సదస్సును గురువారం నిర్వహించారు. ఓయూ ఆర్ట్స్ కళాశాలలోని రూమ్ నంబర్ 133లో తెలుగు విభాగం హెడ్ ప్రొఫెసర్ సాగి కమలాకరశర్మ అధ్యక్షతన నిర్వహించిన రెండురోజుల జాతీయ సదస్సుకు ముఖ్యఅతిథి ప్రొఫెసర్ పురుషోత్తం హాజరై మాట్లాడారు. తెలుగు సాహిత్యంలో అందునా తెలంగాణ నుంచి అత్యధిక రచయితలున్నారన్నారు. తెలుగు భాష, సాహిత్యాలకు తెలంగాణ బిడ్డగా ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. తెలుగు విభాగం మాజీ హెడ్ ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకటరెడ్డి, తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ,వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్యా ధనంజయ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. కాశీం మాట్లాడుతూ ఉత్సాహం, ఉత్తేజం, ఉల్లాసం అంటే ఉస్మానియా విశ్వవిద్యాలయమన్నారు. కార్యక్రమంలో ఓయూ ఫ్యాకల్టి ఆఫ్ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ సైదా తలత్ సుల్తానా, తెలుగు విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ ఏలె విజయలక్ష్మి, సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎస్.రఘు, ప్రొఫెసర్ పులికొండ సుబ్బాచారి, ఇతర విశ్వవిద్యాలయాల తెలుగుశాఖ అధ్యాపకులు, పరిశోధకులు, నిజాం కాలేజీ, శ్రీరామ చంద్ర కాలేజీ, ఏవి కాలేజీ విద్యార్థులు, సాహితీ ప్రియులు, బిరుదురాజు రామారాజు గారి అభిమానులు పాల్గొన్నారు.

## కానూరు వెంకటేశ్వరరావు జీవితం స్ఫూర్తిదాయకం

ముషీరాబాద్, ఏప్రిల్ 10: నాలుగు తరాలని ప్రభావితం చేసిన అరుణోదయ కానూరు వెంకటేశ్వరరావు జీవితం నేటి కవులకు,కళాకారులకు స్ఫూర్తిదాయకం పలువువక్తలు అన్నారు. గురువారం అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు, విప్లవ సాంస్కృతిక ఉద్యమ కళారంగా యోధుడు వెంకటేశ్వరరావు పదో వర్ధంతి సభ విద్యానగర్ మార్క్స్ భవన్‌లో జరిగింది. అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు పి.వేణు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వినయ్‌బాబు, ప్రముఖ సంపదకుడు సతీశ్‌చందర్, సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గోవర్ధన్ మాట్లాడుతూ.. కానూరి నాటి సాంస్కృతిక ఉద్యమ నాయకుడు మళ్లీ పుట్టలేడని కొనియాడారు. కార్యక్రమంలో కామ్రేడ్ బేబక్క, అరుణోదయ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉదయగిరిమల్లన్న, ప్రధాన కార్యదర్శి ఎం.దాసు, వేణు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సతీశ్ చందర్